# జీపీ కార్మికుల వేతన వెతలు

- రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న వైనం
- జీతాలు ఇవ్వలేని స్థితిలో జీపీలు
- పట్టించుకోని ప్రభుత్వం



ఆలూర్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

పెర్కిట్(ఆర్మూర్): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు జీతాలు రాక అష్టకష్టాలు పడుతున్నారు. రెండు నెలలుగా జీతాలు రాక పోవడంతో కుటుంబ పోషణ కోసం కూలి పనులు చేసుకుంటున్నారు. అలాగే కొందరు అప్పులు చేసి బతుకు బండి నడుపుతున్నారు. ఆర్మూర్ పాత మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 158 మంది కార్మికులు(మల్టీ పర్పస్ వర్కర్లు) పని చేస్తున్నారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులతో పాటు ఇంటి పన్నుల నుంచి నిధులతో క్రమం తప్పకుండా కార్మికులకు ప్రతి నెలా రూ.9,500 చొప్పున వేతనాలు చెల్లించే వారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు లేక 13 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలకులు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి సైతం నిధులు రావడం లేదు. దీంతో కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది. అధికారులు కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. కాని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు ట్రెజరీ వద్ద పెండింగ్‌లో ఉంటున్నాయి. గతంలో సర్పంచ్‌లు కార్మికులకు ఏదోవిధంగా జీతాలను సర్దుబాటు చేసేవారు. ప్రస్తుతం పాలకులు లేక పోవడంతో ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

### ఇబ్బందులు పడుతున్నాం

నెలల తరడబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. సర్పంచులు ఉన్నపుడు ప్రతి నెలా జీతాలు వచ్చేవి. వేరు పని చేసుకుంటున్నాం. ప్రభుత్వం క్రమం తప్పకుండా జీతాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి.

– అబ్దుల్ రహీం, జీపీ కార్మికుడు, రాంపూర్

### రెండు రోజుల్లో అందజేస్తాం

గత డిసెంబరు నెల వరకు పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను అందజేశాం. ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరికి సంబంధించిన జీతాల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. రెండు రోజుల్లో కార్మికులకు వేతనాలు వస్తాయి.

– శ్రీనివాస్, ఎంపీవో, ఆర్మూర్

## వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న బోధన్ డీఎల్‌పీవో నాగరాజు

రుద్రూర్: గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు ఆదేశించారు. పోతంగల్ మండలం హంగర్గా ఫారం, పోతంగల్ గ్రామాల్లో మంగళవారం ఇంటి పన్నుల కోసం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. నిర్దేశిత సమయంలో పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన కార్యదర్శులకు సూచించారు.

**ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన**

పోతంగల్ మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై బోధన్ డీఎల్‌పీవో నాగరాజు అవగాహన కల్పించారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి స్థానికులకు వివరించారు. ఎంపీడీవో చందర్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వాహనాలకు స్టిక్కర్ అవసరంగా గుర్తించాలి



క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న సంస్థ సభ్యులు

మాక్లూర్: వాహనాలకు 'డాడీస్ రోడ్' యాప్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అత్యంత అవసరమేనన్న విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించాలని ఆ సంస్థ సభ్యులు అన్నారు. మంగళవారం కల్లెడి గ్రామంలో డాడీస్ రోడ్ యాప్ సంస్థ సభ్యులు పర్యటించారు. వాహనాలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్ల గురించి వివరించి చెప్పారు. స్టిక్కర్ వల్ల వాహనం ఎక్కడ ఉంది.. ఏ వేగంతో వెళ్తుతుంది అనేది తమ మొబైల్‌లో చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా అనుకోని ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. అతి తక్కువ ఖర్చుతో వాహనాలకు స్టిక్కర్ అమర్చుకోవచ్చని వాహనదారులకు సూచించారు. పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, లైన్‌మెన్ లక్ష్మణ్, తదితరులున్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ట్రెసా లక్ష్యం



సభ్యత్వాలను అందిస్తున్న తహసీల్దార్, ట్రెసా బోధన్ డివిజన్ అధ్యక్షుడు విఠల్

బోధన్‌రూరల్: రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కారించడమే తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) లక్ష్యమని అసోసియేషన్ బోధన్ డివిజన్ అధ్యక్షులు, తహసీల్దార్ విఠల్ అన్నారు. మంగళవారం బోధన్ తహసీల్ కార్యాలయంలో డైరీలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా రెవిన్యూ సేవలు అందించడం, రెవిన్యూ వ్యవస్థ పటిష్ఠ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ట్రెసా జిల్లా ఉపాధ్యక్షుడు భూపతి, డివిజన్ కార్యదర్శి వరుణ్, సంతోష, సభ్యులు పాల్గొన్నారు.

### ఒత్తిడికి లేకుండా పరీక్షలు రాయాలి

పెర్కిట్(ఆర్మూర్): ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు.. విద్యార్థులకు సూచించారు. పెర్కిట్‌లో గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను మున్సిపల్ కమిషనర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో వంట గదిలో ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేయాలని ప్రిన్సిపల్‌కు సూచించారు.

### వైద్యులు అందుబాటులో ఉండాలి

ఆర్మూర్‌టౌన్: వైద్యులు ప్రతిరోజు అందుబాటులో ఉండి దవాఖానాకు వచ్చే ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మామిడిపల్లిలోని బస్తీ దవాఖానాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు.

### సమయపాలన పాటించాలి



నవీపేట/పెర్కిట్(ఆర్మూర్): వైద్యశాఖ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి బస్తీ దవాఖానాను, నవీపేట మండలంలోని బినోల పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. అలాగే సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు.

# నవీపేట మేకల సంత @ రూ.61 లక్షలు

- కూరగాయల సంతకు రూ.14 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నవీపేట: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన మేకలు, వారాంతపు కూరగాయల సంతలకు ఆశించిన ఆదాయం వచ్చింది. ఈ రెండు సంతల వేలంలో పాల్గొన్న ఔత్సాహికులు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించారు. మేకల సంత వేలంలో 107 మంది ఔత్సాహికులు పాల్గొనగా రియాజ్ అహ్మద్ రూ.61.31 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. గతేడాది ఈ సంతకు రూ. రూ.40.05 లక్షల ఆదాయం వచ్చింది. కూరగాయల సంత వేలంలో 17 మంది పాల్గొనగా డాంగె సతీష్ రూ. 14.01 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సంతకు గతేడాది రూ.5 లక్షల ఆదాయం వచ్చింది. సులభ్ కాంప్లెక్స్‌కు వేలాన్ని నిర్వహించగా ఆశించిన ఆదాయం రాలేదని వాయిదా వేశారు. ఎంపీడీవో గురునాథ్, ఎంపీవో రామకృష్ణ, కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**వేలాన్ని అడ్డుకున్న యువకులు**

వేలం పాట ప్రారంభమవ్వగానే స్థానిక యువకులు మొదట అడ్డుకున్నారు. ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదని నిలదీశారు. ఇరుకు స్థలంలో ఉన్న సంతలను వేరే చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించాకే వేలం నిర్వహించాలని మొండికేశారు. ఎస్సై వినయ్.. యువకులతో మాట్లాడి శాంతింపజేశారు.

## పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలి



మైనారిటీ ప్రతినిధులు ఇచ్చిన వినతి పత్రాన్ని చూస్తున్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌టౌన్(బోధన్): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే అరికట్టాలని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో బల్దియా అధికారులకు సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకట నారాయణకు సూచించారు. అనంతరం పట్టణంలోని నర్సిరోడ్డు ఈద్గాను పరిశీలించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈద్గా కమిటీ ప్రతినిధులు వసతుల కల్పనలో ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్, బల్దియా సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ సులోచన

ఆర్మూర్‌టౌన్: ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్(డీహెచ్‌ఈ) సులోచన అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు ఎండాకాలంలో వడదెబ్బ నుంచి ఎలా కాపాడుకోవాలి, ఏయే జాగ్రత్తలు పాటించాలన్న అంశాలపై ఆమె సూచనలిచ్చారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించడం, మానవ అక్రమ రవాణా, ప్రమాదాలు, సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం వనజ, హెల్త్ అసిస్టెంట్లు ఆనంద్, కమల, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధనకు కృషి



మాట్లాడుతున్న డీఈవో అశోక్, పక్కన ఎంఈవో

బోధన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను బోధించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యా శాఖాధికారి(డీఈవో) అశోక్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు, వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా డీఈవో విచ్చేసి మాట్లాడారు. పీఎం శ్రీ పథకం కింద జిల్లాలో 40 ఉన్నత పాఠశాలలు ఎంపిక కాగా అందులో ఈ పాఠశాల ఉందని వెల్లడించారు. వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో నాగయ్య, పాఠశాల హెచ్‌ఎం బాల చంద్రం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బెస్ట్ బిజినెస్ మ్యాన్ అవార్డు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణానికి చెందిన మాశెట్టి నర్సయ్య.. సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఏడాది అందించిన బెస్ట్ బిజినెస్ మ్యాన్, సేవా అవార్డుకు ఎంపిక అయ్యారు. గడిచిన 60 ఏళ్లుగా వ్యాపార రంగంలో మాశెట్టి అందించిన సేవలతో పాటు లయన్స్ క్లబ్(బోధన్) ద్వారా ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ నెల 16న హైదరాబాద్‌లో అవార్డులు ప్రదానం చేశారు. నర్సయ్యకు పట్టణానికి చెందిన ప్రముఖులు అభినందనలు తెలిపారు.

### లాఠీచార్జి అమానుషం

నవీపేట: న్యాయమైన డిమాండ్లపై పోరాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన అంగన్‌వాడీలపై పోలీసులు ప్రతాపం చూపడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. నాయకులు ఆంజనేయులు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి విరాళం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్ గల్లీలో పద్మశాలి 3వ తర్ప సంఘ భవనానికి ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చార్టడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ మంగళవారం రూ.50 వేలు విరాళంగా అందించారు. విరాళాన్ని తర్ప అధ్యక్షుడు చిట్ల యజ్ఞేశ్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. 3వ తర్ప సంఘం సభ్యుడిని కాకున్నా, పద్మశాలి బిడ్డగా భావించి భవన నిర్మాణానికి తన వంతుగా రూ.50 వేలు విరాళం అందజేస్తున్నా అన్నారు. తర్ప సంఘం ఉపాధ్యక్షుడు రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

### టీచర్స్ కాలనీలో భూ కబ్జా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఉపాధ్యాయులు కొనుగోలు చేసిన ప్లాట్లను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని బాధితుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ అన్నారు. టీచర్స్ కాలనీలో పలువురు తమ భూమి కబ్జాకు గురవుతుందని అధికారులు విన్నవించినా స్పందించక పోవడంతో వారి ప్లాట్ల వద్ద టెంటు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగుతుందని బాధితులు స్పష్టం చేశారు.

### పాత బకాయిలు చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: మార్కెట్‌యార్డు వ్యాపార సముదాయంలోని వ్యాపారులు తమ దుకాణాల పాత బకాయిలు వెంటనే చెల్లించాల్సిందిగా మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ కోరారు. మంగళవారం ఆర్మూర్ మార్కెట్‌యార్డు కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాత బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని మార్కెట్‌యార్డు కార్యదర్శి భారతికి సూచించారు. మొత్తం 36 దుకాణాలకు గాను రూ. 52 లక్షల పాత బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఏఎంసీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాల ఏర్పాటు, స్టడీ టూర్ నిర్వహణ గురించి సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ విట్టం జీవన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేతల సంబురాలు



రుద్రూర్/కోటగిరి: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రుద్రూర్, కోటగిరి మండల కేంద్రాల్లో వారు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..బీసీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. నేతలు అరుణ్‌కుమార్, గంగారాం పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### కల్యాణ తలంబ్రాల బుకింగ్ ప్రారంభం



బోధన్: భద్రాచలం సీతారాములోరి కల్యాణ తలంబ్రాలు భక్తుల చెంతకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు బుకింగ్ ప్రారంభించారు. మంగళవారం బోధన్ ఆర్టీసీ డిపోలో డీఎం శ్రీనివాస్ బుకింగ్ ప్రారంభించి వివరాలు వెల్లడించారు. తలంబ్రాలు అనవరం ఉన్న భక్తులు రూ.151 చెల్లిస్తే ఇంటి వద్దకు వచ్చి అందిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం 9000093214(బోధన్), 9989137251 (ఎడపల్లి), 9553055835 (సాలూర), 8520929896(వర్ని), 8374542876(రుద్రూర్), 9346793293(కోటగిరి) నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

### ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల వితరణ

వేల్పూర్: కుకునూర్ హైస్కూలులో 31 మంది ఎస్సెస్సీ విద్యార్థులకు స్థానిక తెలుగు భాషోపాధ్యాయుడు పతాని గంగాధర్ మంగళవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం హరిచరణ్, టీచర్లు శ్రీధర్‌రావు, మల్కన్న, నాగరాజు, రవీందర్, అశోక్, చరణ్‌దాస్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే 30 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్, రోటరి కార్యదర్శి రాస ఆనంద్, కోశాధికారి శశిధర్, ప్రవీణ్ పవార్, రాధా కిషన్, లక్ష్మీ నారాయణ, ఖాందేశ్ సత్యం, పట్వారి తులసి కుమార్ పాల్గొన్నారు.

### పరీక్షలంటే భయం వీడాలి

బాల్కొండ: విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడాలని బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. మంగళవారం బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ఉచితంగా పరీక్ష ప్యాడ్లను అందించారు. ఆ ప్యాడ్లను అందజేస్తూ ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మొరం రోడ్డు పనులు ప్రారంభం

రెంజల్(బోధన్): కందకుర్తిలో మంగళవారం మొరం రోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కందకుర్తి నుంచి బోర్గాం రహదారికి రూ.4 లక్షలు, కందకుర్తి నుంచి నవీపేట్ మండలం కోస్లీ గ్రామ రహదారికి రూ.5 లక్షలు, గ్రామంలోని అంతర్గత రోడ్లకు రూ. 3 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ జిల్లా కమిటీ సభ్యుడు గయాస్ తెలిపారు. నాయకులు అజ్మత్‌బేగ్, పుర్కానుద్దీన్, సిరాజ్‌బేగ్, అఫ్రుపటేల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



రెంజల్(బోధన్): బోర్గాంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రూ. 8 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, బోధన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, రెంజల్ విండో చైర్మన్ మొయినోద్దీన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్‌యాదవ్, నేతలు నితిన్, కుర్మె శ్రీనివాస్, సాయరెడ్డి, మేక సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### వర్ని బ్లాక్‌కు రూ.2.87 కోట్లు మంజూరు

వర్ని: వర్ని బ్లాక్ పరిధిలోని చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.87 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి రాజిరెడ్డి వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ నిధులు మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు.

### చలివేంద్రం ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఎస్సై రజనీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజల దాహర్తి తీర్చటానికి ఏర్పాటు చేశామన్నారు.

### హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు

వర్ని: మండల కేంద్రంలో మంగళవారం వీక్లీ మార్కెట్లో ఐసీటీసీ ఆధ్వర్యంలో 60మంది హెచ్ఐవీ నిర్ధారణ, రక్త పరీక్షలను నిర్వహించినట్లు ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ వెల్లడించారు. స్నేహ సొసైటీ, వైఆర్‌జీకే సభ్యులు పాల్గొన్నారు.

### చెత్త కాల్చడం వల్లే కాలుష్యం




వర్ని: సత్యనారాయణపురం జీపీ డంపింగ్ యార్డ్‌లో చెత్తను కాల్చడం వల్ల కాలుష్యం ఏర్పడుతుందని వెంటనే డంపింగ్ యార్డ్‌లో చెత్త కాల్చడాన్ని నిలిపివేయాలని గ్రామస్తులు సత్యనారాయణపురం జీపీ కార్యదర్శి సాయిలును కోరారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

### హుండీల లెక్కింపు

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయం, మారుతి మందిరాలలో మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తుల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. చక్రేశ్వర ఆలయంలో హుండీ ఆదాయం రూ.3,02,699లు, మారుతి మందిర్‌లో హుండీ ఆదాయం రూ.30,660 వచ్చినట్లు ఈవో రాములు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ అర్చకులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | యుగానికి ఒక్కడు (తెలుగు)-10.50, 7.05 ల్యాంప్(తెలుగు)-1.55 1000 వాలా(తెలుగు)-4.20 ఛావా(హిందీ)-10.10 |
| స్క్రీన్-2 | ఛావా(తెలుగు)-11.30, 2.50, 6.10, 9.30 |
| స్క్రీన్-3- | దిల్‌రూబా (తెలుగు) - 10.15, 1.25, 7.30, 10.40 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-4.35 |
| స్క్రీన్-4 | కోర్ట్(తెలుగు)-10.00, 1.05, 4.10, 7.15, 10.20 |

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | దిల్‌రూబా(తెలుగు) - 11.00, 4.35, 7.30, 10.25 ఛావా(హిందీ)-1.40 |
| స్క్రీన్-2 | యుగానికి ఒక్కడు -11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30 |
| స్క్రీన్-3 | ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.30, 7.30 ఛావా(తెలుగు)-4.30, 10.20 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40 |
| స్క్రీన్-2 | కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50 |
| స్క్రీన్-3 | ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45 |
| స్క్రీన్ -4 | దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25 |
| లలితామహల్ | కోర్ట్ (తెలుగు)-11.00, 2.00, 6.00 10.00 |
| దేవి | దిల్‌రూబా(తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00 |
| నటరాజ్ | యుగానికి ఒక్కడు (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00 |
| విజయ్ | ఛావా (తెలుగు)-10.30, 2.15, 6.10, 10.05 |

### మాంసం ధరలు(రూ..)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 140 |
| | | లైవ్ | 90 |
| స్కిన్‌లెస్ | 160 | మటన్ | 800 |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 88,900 | వెండి(కిలో) | 1,03,000 |
| 22 క్యారెట్స్ | 82,047 | | |

– నిజామాబాద్ బిజినెస్